క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈవిధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 18, బెండ 55, పచ్చి మిర్చి 55, కాకర 45, బీర 45, క్యాబేజి 11, ఫ్రెంచిబీన్స్ 55, క్యారెట్ 23, దొండ 35–40, చిక్కుడు 55, గోకర 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 45, ఆలు 16, దోస 35, సొర 9, పొట్ల 15, ఉల్లి 14 చామ గడ్డ 55 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కృష్ణాదిశేషుకు సత్కారం

ఎల్‌బీనగర్: సినిమాలు, టీవీ సీరియల్స్ ప్రజలపై అత్యంత ప్రభావం చూపిస్తాయని, దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా మంచి కార్యక్రమాలు ప్రసారం అయ్యేలా సెన్సార్‌బోర్డు తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగొని రాంమోహన్‌గౌడ్ అన్నారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్‌గా నియమితులైన బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన కృష్ణాదిశేషు శనివారం మర్యాద పూర్వకంగా రాంమోహన్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రాంమోహన్‌గౌడ్ ఆయనను సత్కరించారు. తనకు ఇచ్చిన పదవిని బాధ్యతతో నిర్వహిస్తానని కృష్ణాదిశేషు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను పెంచాలి

చైతన్యపురి: సరిపడా పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది లేనందున కాలనీలు, బస్తీల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోందని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా చెత్త తరలించేందుకు అవసరమైన పారిశుద్ధ్య సిబ్బంది, సూపర్‌వైజర్లను విధుల్లోకి తీసుకోవాలని అధికారులను కోరారు. సరైన యంత్రాంగం లేనందున చెత్తాచెదారం పేరుకుపోయి పరిసరాలు దుర్గంధ భరితంగా మారుతున్నాయన్నారు. దీనికితోడు దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ మాదన్నపేట వాటర్ ట్యాంక్ వద్ద మాదన్నపేట ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కేన్సర్ స్క్రీనింగ్, చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

దర్గాపై దాడి: నిందితులపై కేసు నమోదు

చంచల్‌గూడ: ఈదీ బజార్‌లోని దర్గాపై దాడి చేసిన 27 మందిపై మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలివీ... ఈదీ బజార్‌లోని హజరత్ షా కియాముద్దీన్ కిబ్లా దర్గాలో ముతవల్లీగా గడచిన తొమ్మిదేళ్లుగా షా మహ్మద్ తాజుద్దీన్(32) విధులు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం ఖలీమ్, అజీజా బేగంతో పాటు మరో 25 మంది వచ్చి తనను భయభ్రాంతులకు గురిచేసి దర్గాలో వస్తువులను ధ్వంసం చేశారని ముతవల్లీ మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు 27 మంది నిందితులపై కేసు నమోదు చేశారు.

దేవాలయంలో హుండీ చోరీ

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న వినాయకుడి ఆలయంలోని హుండీ చోరీకి గురైంది. పోలీసుల సమాచారం మేరకు... వినాయకుడి ఆలయంలోని హుండీని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆయల మేనేజర్ లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'త్వరలో ఆలయ భూమిని స్వాధీనం చేసుకుంటాం'

చంపాపేట: కబ్జాకు గురైన కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ భూమిని ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు త్వరలో స్వాధీనం చేసుకుని ఆలయానికి అప్పగిస్తామని సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ వెల్లడించారు. శనివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ఆలయానికి చెందిన 15 కుంటల ఆక్రమిత భూమిని ఎంఆర్‌ఓ జయశ్రీ, ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, సీఐ జానికిరెడ్డి, ఎండోమెంట్ ఏసీ కృష్ణ, ల్యాండ్ ప్రొటెక్షన్ అధికారులు సునీత, గీత, విజయ్‌కుమార్, ఇతర రెవిన్యూ సిబ్బందితో కలసి క్షేత్ర పరిశీలన చేసి ఆక్రమిత స్థలంలో గుడిసెలు వేసుకుని స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారిని త్వరలో ఖాళీ చేయాలని ఆదేశించారు.

మినీ ట్యాంక్‌బండ్
అభివృద్ధి కలేనా?

సుందరీకరణకు దూరంగా సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్



సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్‌పై చెత్త కుప్పలు

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ సందర్శించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తరువాత కొన్ని రోజులకు మురుగునీరు, వ్యర్థాలకు నిలయమైన చెరువుకట్టను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు తాను దత్తత తీసుకుంటున్నట్లు అప్పటి రాచకొండ కమిషనర్ మహేష్ భగవత్ ప్రకటించారు. దీంతో దుర్గంధ భరితంగా తయారైన సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌కు మహర్దశ రానుందని అందరూ ఆశపడ్డా వారి ఆశలు అడియాశలే అయ్యాయి.

- పనిచేయని ట్రీట్‌మెంట్ ప్లాంట్
- చెరువు కట్టపై చెత్త కుప్పలు
- కుంగిపోతున్న చెరువు కట్ట
- పట్టించుకోని అధికారులపై సర్వత్రా ఆగ్రహం

చైతన్యపురి: ముఖ్యమంత్రి హామీ, ఉన్నతాధికారి దత్తత ప్రకటనలు అమలు చేయడంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతున్న కారణంగా సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు.

- 1906లో అప్పటి నిజాం రాజు తాగునీరు, వ్యవసాయ అవసరాల కోసం 99 ఎకరాల్లో చెరువును తవ్వించారు. ఇటలీ నుంచి వలస వచ్చే పక్షులు సరూర్‌నగర్ చెరువును విడిదిగా చేసుకొనేవి. ఇక్కడే తమ సంతతిని వృద్ధి చేసుకొని తిరిగి ఇటలీకి పయనం అయ్యేవి.
- ఇదిలా ఉండగా నగరం అభివృద్ధి చెందటం.. చెరువు పరిసరాలు ఆక్రమణలకు గురి కావటంతో చెరువు కాస్తా ప్రస్తుతం 60 ఎకరాలకే పరిమితమైంది.



- పాత సరూర్‌నగర్ మండలంలోని గ్రామాలు, అక్కడి చెరువుల నుంచి మురుగునీరు సరూర్‌నగర్ చెరువులో కలుస్తుండటంతో అదికాస్తా మురికి కూపంలా తయారైంది. దీనికి తోడు పరిసర కాలనీల ప్రజలు వ్యర్థాలను చెరువులో డంప్ చేస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది.
- క్రమేపీ కాలుష్యం పెరిగిపోవడం.. తమ సంతతిని వృద్ధి చేసుకునేందుకు అనువైన వాతావరణం దూరం కావడంతో క్రమేపీ వలస పక్షులు రాకపోకలు ఆగిపోయాయి.



కుంగిపోతున్న చెరువు కట్ట, ఫెన్సింగ్

- 2003వ సంవత్సరంలో స్థానికుల ఆందోళనతో రూ. 3 కోట్ల వ్యయంతో సివరేజ్ ప్లాంట్లను ఏర్పాటు చేసినా సక్రమంగా పనిచేయక పోవటంతో చెరువు కాస్తా మురుగునీటితో నిండిపోయింది. చెరువు అభివృద్ధిలో భాగంగా ఇందిరా ప్రియదర్శిని పార్కును ఏర్పాటు చేసి బోటింగ్ సౌకర్యం కల్పించారు. అందులోని నీరు దుర్గంధభరితంగా ఉండటంతో బోటింగ్‌కు సందర్శకుల నుంచి ఆదరణ లేకుండా పోయింది.
- ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనిచేయక పోవటంతో చెరువులోకి మురుగు నీరు వచ్చి చేరి దుర్వాసన వస్తూ మినీట్యాంక్ బండ్‌కు వచ్చే సందర్శకులకు అసౌకర్యానికి గురిచేస్తుంది. సరూర్‌నగర్ చెరువు పరిసరాల్లోని కాలనీల ప్రజలు కూడా భరించలేని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.



చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన చెరువు

- నిత్యం వందలాది మంది సేద తీరేందుకు మినీ ట్యాంక్ బండ్‌కు వస్తుంటారు. చెరువు కట్టపై చెత్తకుప్పలు, సరిగా లేని ఫ్లోరింగ్ వల్ల అసౌకర్యానికి గురవుతున్నారు.
- సక్రమంగా నీరు పోయటం, నిర్వహణ లోపం వల్ల గ్రీనరీ ఎండిపోయి అందవిహీనంగా తయారైంది.
- చెరువు నీటిలోని వ్యర్థాలు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించక పోవటంతో నీటిపై ప్లాస్టిక్ కవర్లు, చెత్త ఇతర వ్యర్థాలు తేలుతూ కన్పిస్తున్నాయి.
- చెరువు చుట్టూ ఉన్న ఫెన్సింగ్ సైతం కుంగి ప్రమాదకరంగా మారింది. చెరువు కట్ట కూడా కొన్ని ప్రాంతాల్లో కుంగిపోయి సందర్శకులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.
- అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరించి సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌ను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఎండిపోతున్న మొక్కలు

నాసిరకంగా డ్రైనేజీ పనులు

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



వీరన్నగుట్టలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: వీరన్నగుట్ట కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆరోపించారు. వీరన్నగుట్ట, షిరిడీ సాయినగర్, అంజలి రెసిడెన్సీలో శనివారం ఉదయం మార్నింగ్‌వాక్ చేపట్టి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వీరన్నగుట్టకాలనీ మంచినీరు లోప్రెషర్‌తో వస్తున్నందున బస్తీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేసవి దృష్ట్యా నూతన పవర్‌బోర్లు, హ్యాండ్ పంపులను వేయాలని కోరినా అధికారుల్లో స్పందన లేదని మండిపడ్డారు. అంజలి రెసిడెన్సీ కాలనీలోని పార్కు స్థలాన్ని సుందరీకణ చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. వీరన్నగుట్టపై ఉన్న శ్రీ సీతారాముల ఆలయం వద్ద జరుగుతున్న ఫ్లోరింగ్ పనులు, కొలనును పరిశీలించారు. వీరన్నగుట్ట షిరిడీ సాయినగర్‌కాలనీలో రూ. 35 లక్షల అంచనాలతో రూపొందించిన సీసీ రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. కాలనీల నేతలు నర్సింహ యాదవ్, శేఖర్‌గౌడ్, హరినాథ్, రామారావు, కోటయ్య, సతీష్, మంగయ్య, చిన్నా యాదవ్, సత్తయ్య, వెంకట్‌రావు, శోభన్, జయతేజ, యాదగిరి యాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఒంటెత్తు పోకడతో ఓటమి తప్పదు!

- పార్టీని నమ్ముకున్న వారిని పట్టించుకోవడం లేదు
- మంత్రి సబితపై బీఆర్‌ఎస్ నేత మనోహర్‌రెడ్డి ధ్వజం



మీర్‌పేట: మంత్రి సబితారెడ్డి పార్టీలో అందరినీ కలుపుకొని పోవాలని, లేకుంటే ఓటమి తప్పదని బీఆర్‌ఎస్ నేత కొత్త మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు కారు గుర్తుపై ఒక ఎమ్మెల్యే గెలవలేని పరిస్థితి ఉందన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన ఓ మాజీ ఎమ్మెల్యే పార్టీని భ్రష్టుపట్టించారని, మంత్రి సబిత కూడా పార్టీని బలోపేతం చేయకపోగా, మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న వారిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సబిత ఒంటెత్తు పోకడలతో జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మీర్‌పేట తప్ప అన్ని చోట్ల పార్టీ ఓటమిపాలైందని గుర్తుచేశారు. ఇప్పటికైనా సబిత పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని కోరారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు జరిగితే ముఖ్య నాయకులకు సమాచారం ఇవ్వడం లేదని, ఇలా అయితే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. దళితబంధును మంత్రి తన అనుచరులకే ఇప్పించారని, అర్హులకు ఇవ్వాలని, లేకపోతే దళితులతో కలిసి బాలాపూర్ చౌరస్తాలో ధర్నా చేపడతానని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎవరికీ మద్దతు ఇవ్వలేదని, గెలుపు, ఓటములపై తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో మహేశ్వరం నుంచి ఎవరూ పోటీ చేయని సమయంలో తాను కారు గుర్తుపై పోటీ చేసి 43 వేల ఓట్లు సాధించానని, ముఖ్యమంత్రి ఆదేశిస్తే రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మనోహర్‌రెడ్డి ప్రకటించారు. బీఆర్‌ఎస్ నాయకులు గుర్ల సంతోష్‌కుమార్, వేద భవాని, అభిలాష్, తిరుపతయ్య, మహేందర్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను సస్పెండ్ చేయాలి: మల్‌రెడ్డి రాంరెడ్డి



మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: ఉద్యోగ పరీక్షల పేపర్ల లీకేజీపై టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎల్‌బీనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేపర్ల లీకేజీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శమని మల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ముఖ్యమంత్రి కేసీఆర్ నైతిక బాధ్యత వహించాలని అన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కాంలో విచారణకు వెళ్తే హంగామా చేసిన మంత్రులు పేపర్ల లీకేజీలపై ఆ స్థాయిలో స్పందించక పోవడం దారుణమన్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకుంటే ఆయన ఎందుకు మాట్లాడటం లేదన్నారు. పేపర్ లీకేజీలపై సీబీఐ ఎంక్వైరీ వేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. నాయకులు శ్రీపాల్, లింగాల కిషోర్‌గౌడ్, కుట్ల నర్సింహాయాదవ్, మంజులత, బండ సురేందర్, జైపాల్, భాను, గోపి, నారాయణ, అరుణ్, యాదగిరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'లీకేజీ'లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: కాంగ్రెస్



నిరాహార దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

మన్సూరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌లపై సిట్టింగ్ జడ్జిలో లేదా సీబీఐతో విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బల్మూరీ డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌ను నిరసిస్తూ టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ దర్పెల్లి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో శనివారం నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లక్షలాది మంది నిరుద్యోగ యువత జీవితాలలో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కున్న ఎమ్మెల్సీ కవితకు బాసటగా నిలుస్తున్న మంత్రులు విద్యార్థుల పక్షాన ఎందుకు నిలబడటం లేదని ప్రశ్నించారు. పోరాడి కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఆత్మహత్యలే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగ యువకులు అధైర్యపడవద్దని, కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పేపర్‌లీక్ కారణమైన వారు ఎంతటి హోదాలో ఉన్నా కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భీమిడి రామకృష్ణారెడ్డి, నాయకులు గజ్జి భాస్కర్‌యాదవ్, పణ్యాల జైపాల్ రెడ్డి, కళ్లెం సుజాతారెడ్డి, ఎర్రంబెల్లి సతీష్‌రెడ్డి, కోట్ల శ్రీనివాస్, బుడ్డ సత్యనారాయణ, మల్లారపు శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి, కిషోర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, రాజేశ్వరీ పాల్గొన్నారు.

5న ర్యాలీని జయప్రదం చేయండి: సీఐటీయూ

వనస్థలిపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో అఖిల భారత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ పిలుపునిచ్చారు. శనివారం వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్ కాలనీలో సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను, రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బి.దుర్గారావు, గణేష్, నరేందర్, చెన్నయ్య, అంజమ్మ, లలిత, చంద్రమ్మ, అలివేలు, చంద్రకళ, అనిత, సుగుణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



హెల్త్ కార్డులను అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఇందిరానగర్‌లో శనివారం చేపట్టిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమానికి హాజరయ్యారు. నమోదు ప్రక్రియ పూర్తయిన వారికి కార్డులను పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసిందన్నారు. ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు తీసుకొచ్చిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చందు, శంకర్, భవాని, సంతోష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్, నాగేశ్వర్‌రావు

నాగోలు: నేరాలు జరగకుండా సీసీ కెమెరాలు ఉపకరిస్తాయని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, ఎల్‌బీనగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వర్‌రావు అన్నారు. కొత్తపేట డివిజన్‌లోని కమర్షియల్ టాక్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకేగాకుండా నేరాలు జరిగినప్పుడు నిందితులను సత్వరమే పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ మధుసూదర్, కాలనీ అధ్యక్షుడు అంజయ్యగౌడ్, విశ్వేశ్వరరావు, నేతలు రాంచందర్‌రెడ్డి, సత్యనారాయణ, మంచి రాజేష్, లింగాల రాహుల్‌గౌడ్, రామకృష్ణ, సైదులు, రాకేష్ యాదవ్, కొత్త తిరుమల్, గట్టు మహేష్, వెంకట్‌రెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్‌టైప్ నాలా పనులను సత్వరమే పూర్తిచేయండి

మన్సూరాబాద్: సుష్మ నుంచి ఆగమయ్యనగర్ కాలనీ మీదుగా మన్సూరాబాద్ పెద్ద చెరువు వరకు చేపట్టిన బాక్స్‌టైప్ నాలా నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, రానున్న వర్షాకాలాన్ని దృష్టికి ఉంచుకుని నాలా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని సూపరింటెండెంట్ ఇంజినీర్ (ప్రాజెక్టులు) రవీందర్ రాజుకు శనివారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం మన్సూరాబాద్‌లో కొప్పుల నర్సింహారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... మన్సూరాబాద్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలోని వైశ్యా కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు కోర్టులో స్టే పిటిషన్ వేసి బాక్స్‌టైప్ నాలా పనులను నిలిపివేయించారన్నారు. ఇరిగేషన్ అధికారులు స్టేను వుకేట్ చేయించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రైవేటు వ్యక్తులతో అధికారులు కుమ్ముక్కయ్యారని ఆరోపించారు. బాక్స్‌టైప్ నాలా పనులు నిలిచిపోవడంతో చెరువులోకి మురుగు నీరు చేరి చెరువు కలుషితమవుతుందని, భూగర్భ జలాలలు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాలను అనుమతులు లేకున్నా ఇరిగేషన్ అధికారులు ఎన్‌ఓసీలు జారీచేసి అనుమతుల ప్రక్రియకు సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టులోని స్టేను త్వరగా వెకేట్ చేయించి బాక్స్‌టైప్ నాలా త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ కార్తీక్, ఏఈ పవన్‌లను సూపరింటెండెంట్ ఇంజినీర్ (ప్రాజెక్టులు) రవీందర్‌రాజు ఆదేశాలు జారీ చేసినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

పూడికతీత పనులను వేగవంతం చేయాలి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: బండ్లగూడ చెరువులో పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం నాగోల్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప కాలనీ పక్కన ఉన్న బండ్లగూడ చెరువులో జరుగుతున్న పూడికతీత పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... చెరువులోకి వెళ్లే మార్గం బాగా మట్టి పేరుకుపోయిందన్నారు. దీంతో చుట్టుపక్కల ఉన్న కాలనీలో డ్రైన్స్‌లో మురికినీరు రోడ్డు మీద పొంగిపొర్లుతోందన్నారు. ఓపెన్ డ్రైన్స్‌లో నీరు సాఫీగా పోవడం లేదని తెలిపారు. దానిలో భాగంగా చెరువు ముందు భాగంగా పేరుకుపోయిన మట్టిని నీటిలో తేలాడే జేసీబీ సాయంతో తొలగించి నీరు సాఫీగా పోవడానికి చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

పలు రంగాల్లో న్యాయవాదులకు అవకాశాలు

తెలంగాణ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు నరసింహారెడ్డి



వేడుకల్లో పాల్గొన్న నరసింహారెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: స్వాతంత్ర పోరాటంలో న్యాయవాదుల పాత్ర మరవలేనిదని, న్యాయవాద వృత్తిలో స్థిరంగా కష్టపడి పనిచేస్తే అనేక రంగాలలో న్యాయవాదులకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎ.నరసింహారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని మహాత్మా గాంధీ న్యాయ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే సంబురాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహారెడ్డి మాట్లాడుతూ... న్యాయవాదులు నిరంతరం సామాజిక బాధ్యతతో మెలగాలని, సమాజంలో అన్ని రంగాల వారికి బాధ్యతతో కూడిన అండగా ఉండాలని సూచించారు. సమ న్యాయ పాలనలో న్యాయవాదులు ప్రధాన పాత్ర వహించాలని తెలిపారు. తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ అలోక్‌కుమార్ మాట్లాడుతూ... న్యాయ శాస్త్ర విద్యార్థులు కష్టపడి చదువుతూ క్రమశిక్షణ కలిగి సమాజంలో అన్యాయన్ని ఎదుర్కొనే శక్తి కలిగి ఉండాలని తెలిపారు. ఏపీ హైకోర్టు న్యాయవాదుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు తరుచు అధ్యాపకుల సలహాలు, సూచనలు తీసుకొని వాటిని పాటించాలని సూచించారు. కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... తన సతీమణి గంగుల అరుణ పేరు మీద కళాశాలలో పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందిన విద్యార్థులకు బంగారు పతకాలను, నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, విద్యార్థులు ముచిన్, అన్నపూర్ణ, శ్వేత, రాఖీ, సాయి కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడితోసహా తల్లి అదృశ్యం



అనిత



ధనుష్

మలక్‌పేట: పుట్టింటికి వెళ్తున్నానని ఇరుగురుపొరుగు వారికి చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ తల్లి తన కుమారితోసహా అదృశ్యమైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ సమాచారం మేరకు... మెదక్ జిల్లా అట్లునూర్ మండలం మాదారం గ్రామానికి చెందిన తలారి శంకర్ కుమారుడు తలారి దాతు సలీంనగర్ వివేకానంద్ స్కూల్ సమీపంలో ఉన్న శివ రెసిడెన్సీలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఏడు నెలలుగా అక్కడే ఉంటున్నారు. ఆరేళ్ల క్రితం దాతుకు జోగిపేటకు చెందిన అనిత(25)తో వివాహం జరిగింది. వీరికి ధనుష్(5) అనే కుమారుడు ఉన్నాడు. అనిత మానసిక స్థితి బాగా లేకపోవడంతో ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. శుక్రవారం మధ్యాహ్నం ఆమె, తన కొడుకును తీసుకుని జోగిపేటకు వెళ్తున్నట్లు ఇరుగుపొరుగు వారికి చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లింది. దాతు అత్తగారింటి ఫోన్ చేయగా జోగిపేటకు రాలేదని చెప్పారు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వారి కోసం వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో దాతు శనివారం మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహిళా ఎస్‌ఐ శృతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.